# పాహిరామ ప్రభో...పాహి రామప్రభో...



## జయహనుమ నామంతో మార్మోగిన తిరుమల

తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:

తెల్లనిమంచుతెరల నడుమ,శేషగిరులే హిమగిరులను తలపిస్తున్న వేళ మంగళవారం ఉదయం తిరుమల నాదనీరాజనం వేదికపై అయోధ్యకాండ అఖండపారాయణం విజయవంతంగా జరిగింది. అయోధ్యకాండలోని 14వ సర్గ నుండి 17వ సర్గ వరకు ఉన్న మొత్తం 186 శ్లోకాలను,యోగవాసిష్టం-ధన్వంతరి మహామంత్రం 25 శ్లోకాలు వేదపండితులు పారాయణం చేశారు. పారాయణం చేశారు. చివరగా అన్నమాచార్యప్రాజెక్టు కళాకారులు మధుసూదన్,లావణ్య బృందం "పాహిరామ ప్రభో....పాహి రామప్రభో....జయ హనుమ...జయహనుమ"నామసంకీర్తనలతో తిరుమలకొండలు మార్మోగాయి.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# పొంగి పొర్లుతున్న నదులు: తెరచుకున్న కాళంగి గేట్లు



శ్రీకాళహస్తి ఎస్‌డికె నగర్‌లో ద్వీపాల్ని మరిపిస్తున్న నీటి దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త

తిరుపతిజిల్లా తూర్పు మండలాలను మిచెంగ్ తుఫానుతో అతలాకుతలం చేస్తుంది. సోమవారం ఉదయం నుంచి ముసారతో తల్లడిల్లిన జనాన్ని మధ్యాహ్నం నుంచి కుండపోత వాన ముంచెత్తింది. రుతుపవనాలు,తుఫాను కారణంగా ఆది, సోమవారాల్లో రాత్రి నుంచి ఎడతెరిపి లేని వాన కురుస్తుంది. సివారు కాలనీలు నీటిలో తేలియాడుతున్న తెప్పలా కనబడుతున్నాయి.ఎటు చూసినా నీళ్ళు అన్నట్లు జలమయమైంది. ప్రభుత్వ కార్యాలయాలు నీటిలో తెప్పలా తేలియాడుతూ కనబడింది. ముఖ్యంగా ఏరియా ఆసుపత్రి, అర్బన్, ఆర్ అండ్‌బి అతిధి గృహం, జూనియర్ కళాశాల ప్రాంతాలతో పాటు తుడా కార్యాలయం, ఎస్‌డికె నగర్, విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఇక

### స్వర్ణముఖినదిలో జలకళ

లోతట్టు ప్రాంతాలైన ఎంఎంవాడ, సంతమైదానం చెంచులక్ష్మికాలనీలో కొంత భాగం లో నీరు ప్రవేశించి గందరగోళంగా మారింది. కెవిబిపురం,వరదయ్యపాళెం,బుచ్చినాయుడు కండ్రిగలోని పలు ప్రాంతాలు ఆయోమంగా మారింది.

**ఒకటే ధార . . .**

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, తుఫాను ప్రభావంతో ఈ ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి కుండపోతగా వర్షం తో వీధులు జలమయమయ్యాయి.జన జీవనం స్థంభించింది. రోడ్ల మీద, పంటపొలాల్లో నీరు నిలిచి సముద్రంలా మారింది. ఎటుచూసినా వర్షపు నీరుతో మునక ప్రాంతాలుగా మారింది. శివారు ప్రాంతాల్లోని ఎస్‌డికె నగర్‌లో వాతావారణం బీభత్సంగా కనబడింది. మధ్య మధ్యలో ఇళ్ళు చుట్టూ నీళ్ళతో ఈ కాలనీలోని ఇళ్ళు ద్వీపాల్లా మారింది. చుట్టూ నీళ్ళతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆగమ్యగోచర పరిస్థితి చోటు చేసుకుంది. ఇక్కడి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. సోమవారం ఉదయం శాసనసభ్యుని బియ్యపు మధుసూధనరెడ్డి అధికారులతో కలసి ఏనుగులగుంట పరిసరాల్లో పర్యటించి అధికారుల్ని అప్రమత్తం చేశారు.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం:**

తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో అడుగడుగునా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొత్తపేట ప్రాంతాల్లో సోమవారం రాత్రి 9గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక జనం నరక యాతన పడ్డారు. అయితే అధికారులు ఎప్పటికప్పుడు జనజీవనానికి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.ఎక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గితే అక్కడ వెంటనే హాజరై సమస్యను పరిష్కరించారు.





కాళంగి నది పొంగి రైల్వే వంతెనల వద్ద ప్రమాదం, కాళంగి సమీపంలో రైస్‌మిల్లుని చుట్టుముట్టిన నీరు ప్రభాతవార్త, తడ

## తీరం దాటిన మిచౌంగ్ తుఫాన్

### -తిరుపతిని వీడిన వర్షం

తిరుపతి,డిసెంబర్ 5ప్రభాతవార్త

నాలుగురోజులు తిరుపతి జిల్లా ప్రజల జనజీవనంస్తంభింపజేసి.....కాలువలు,చెరువులు, నదులు పొంగి ప్రవహించేలా జలమయంచేసిన మిచౌంగ్ తుఫాన్ మంగళవారం ఉదయం తీరం దాటడంతో తిరుపతిజిల్లాలో వర్షం వీడింది. మంగళవారం నెల్లూరు-బాపట్ల వద్ద తీరం దాటడంతో తిరుపతి జిల్లా వర్షం బారినుండి తేరుకుంది. ఉదయం నుండి మేఘావృతమైనప్పటికీ చినుకుపడలేదు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో సూర్యుడు కనిపించడంతో ప్రజలు కొంత వరదనుండి తేరుకున్నారు. ముఖ్యంగా తుఫాన్‌తో భారీ వరదలతో తిరుమల కొండల్లోంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో తిరుమలలోని ఐదు జలాశయాలు నిండుకున్నాయి. గేట్లు ఎత్తివేయడంతో వరదనీరు తిరుపతిలోని కపిలతీర్థం జలాశయంకు ఉధృతంగా చేరుతోంది. ఈ నీరు తిరుపతి చుట్టుపక్కల చెరువుల్లోకి చేరింది. లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయంగా మారాయి. కాలనీలు నీటిలో మునిగాయి. గతం కంటే ఈ వరదలకు కొన్ని కాలనీలు వర్షంనీటి నుండి విముక్తి లభించింది. గత రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలకు తిరుపతి పరిసరాల్లోనే 30సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. తిరుపతి జిల్లాలో 5,994మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. తిరుపతి నగరంలోనే 120.2మిల్లీమీటర్లు, రూరల్‌లో 98.4మిల్లీమీటర్లు,రేణిగుంట 104.2,గూడూరులో 271.6మిల్లీమీటర్లు, నాయుడుపేట 241.4,శ్రీకాళహస్తి 226.4మిల్లీమీటర్లు, సూళ్ళూరుపేట 222.2,తడ 199 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అన్ని చోట్లా మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో లమయంగామారింది. మంగళవారం ఉదయం మళ్ళీ వర్షం కురిస్తే జనజీవనంస్తంభించిపోయే ప్రమాదం కనిపించింది. అయితే తుఫాన్ తీరం దాటడంతో తిరుపతి జిల్లా వాసులు కొంతవరకు ఊపిరిపీల్చుకునే పరిస్థితులు వచ్చాయి. కాగా రోడ్లన్నీ జలమయంగా మారడం, వంకలు, నదులు పొంగి ప్రవహించడంతో చాలావరకు వాహనాలు రాకపోకలకు పూర్తిగా స్తంభించిపోయాయి. రెండురోజులు వరదనీటితో తిరుపతి జిల్లాను ముంచెత్తింది. రేణిగుంట విమానాశ్రయం రన్‌వే కూడా నీటమునిగింది. రెండురోజులు విమానాశ్రయం మూసివేసి విమానాలు రద్దయ్యాయి. మంగళవారం వర్షం లేకపోవడంతో బుధవారం పరిస్థితులు పూర్తిగా తేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

# పొంగి పొరలిన కుశస్థలీ

### వంతెనను తాకుతూ పారిన ఉయ్యలకాలువన పలు ప్రాంతాలు జలమయం





నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త:

మిచౌంగ్ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా గాలులతో కూడిన వర్షం కురిసింది. నగరి మండలంలో 309.2 మి.మీ వర్షం నమోదు కాగా విజయపురంలో 278.8, నింద్రలో 226 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం అధికంగా కురవడంతో తాకిడికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కృష్ణాపురం డ్యాం గేట్లు తెరిచిన కారణంగా కుశస్థలీ నదిలోనీరు పొంగి పొర్లింది ముందస్తు జాగ్రత్తగా కీళపట్టు లో తట్టు వంతెనకు ఇరువైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉయ్యాల కాలువ పొంగిపొర్లడంతో టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ కాలనీ, కాకవేడు ఏఏడబ్ల్యు సాయినగర్, అశోక్ నగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. తడుకుపేట, శెట్టి గుంట, ఎస్టీ కాలనీలో నివాసాల్లోకి నీరు చేరింది. వారికి వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకుడు రాజేంద్ర ఆహారం పొట్లాలను అందించి భరోసా కల్పించారు. కీళపట్టు చెరువు పొంగి పొర్లడంతో నలుగురు రైతులకు చెందిన 14 ఎకరాల వరిపంట నీట మునిగింది.

### నీట మునిగిన వరి నాట్లు.. అపార నష్టానికి గురైన రైతులు

వెంకటగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త



వెంకటగిరి ప్రాంతంలో తుఫాను కారణంగా భారీ వర్షం పడడంతో వరి నాట్లు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కైవల్యా నది గోడ్డేరు వాగులు ప్రవాహానికి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మండలంలోని చిలకంపాడు పారువోలు మన్నెగుంట తదితర గ్రామాల్లో వరినాట్లు నీట మునిగాయి. తుఫాను కారణంగా వరి నాట్లు నీటి మూలములతో పెట్టిన పెట్టుబడి నీటిపాలైనట్లు రైతులు వాపోయారు. కైవల్య నది వరద ఉదృత్తికి కుర్జాగుంట గ్రామం వద్ద రోడ్డు కోత గురైంది. పలు గ్రామాలకు వాహన రాకపోకలు స్తంభించాయి. వెంకటగిరి పట్టణం గ్రామాల్లో పెనుగాలులకు మహారుక్షాలు నేలకూలాయి. హైవే నది గోడేరు వాగు పొంగి ప్రవహిస్తోంది.

### మిచాంగ్ తుఫాన్‌తో

# అతలాకుతలమైన గ్రామాలు

### స్తంభించిన రాకపోకలు
### పొంగి పొర్లన వాగులు, వంకలు అగిన విద్యుత్ సరఫరా





నీట మునిగిన పంట పొలాలు, కూలిన ఇళ్లు

వరదయ్యపాలెం, డిసెంబర్ 5, ప్రభాతవార్త

మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో గ్రామాల్లోని ప్రజలకు అతలాకుతలంగా మారింది. శనివారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరా ఇప్పటి వరకు ఆగిపోవడంతో ప్రతి కుటుంబాల్లో కూడా త్రాగునీటికి ఇబ్బంది పడ్డారు. ప్రతి కొన్ని పూరిల్లో నీళ్ళు వచ్చాయి. ఎక్కడ పట్టినా చెట్లు చాములు గాలికి భయంకరమైన గాలివానకు విరిగిపడిపోయాయి. 10 గంటల నుంచి రాకపోకలు ఆగిపోయాయి. కాలవలు పొంగిపొర్లుతున్నాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రాగునీటికి ఇబ్బందులు పాలయ్యాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రాగు నీటికే తీవ్ర ఇబ్బంది పడ్డారు. తెలుగుదేశం నాయకులు శివయ్య పెట్రోల్ బంకు మాత్రం ప్రజలు ఏవిధంగా ఇబ్బంది పడకూడదని ఆ బంకు ద్వారా మాత్రం పెట్రోల్ బంక్ యాజమానం పెట్రోల్ డీజిల్ సదుపాయం ఏర్పాటు చేసారు. వరదయ్యపాలెం తహశీల్దార్ గౌరీ శంకర్, మండల పోలీస్ స్టేషన్ వరదయ్యపాలెం ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం తన సిబ్బందితో ఎప్పటికప్పుడు గ్రామాలలో పర్యటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. చెరువుల వద్దకు వెళ్లి ప్రజలను లోతట్టు ప్రాంతాల గురికాకుండా పలు చర్యలు సలహాలు అందించారు. మండల కేంద్రంలో విద్యుత్తు సర్వీస్ వైర్లన్నీ కిందకు విద్యుత్ స్తంభాల నుండి తెగి కింద పడిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. పక్కా ఇళ్లల్లోకి పూరిళ్లలోకి నీళ్లు చేరాయి. జనజీవనం అస్తవ్యస్తంగా ఉంది.

**ఏరులో కొట్టుకుపోయి చెట్టుకు వేలాడిన ఏఈ**



వరదయ్యపాలెం మండలంలో అద్దూరు ఏరు దాటుతుండగా విద్యుత్ ఏఈ శివప్రసాద్ ఏరులో కొట్టుకుపోయి చెట్టుకు వేలాడుతున్నారు. దీంతో సమాచారం అందుకున్న రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్ బాబు పోలీసులకు సమాచారం ఇచ్చి ఉదృతంగా పారుతున్న ఏరు నుంచి వరదయ్యపాలెం ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం తన సిబ్బందితో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

## జలాశయాల గేట్లను తెరచి నీటిని వదలిన అధికారులు

తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ఎడతెరపి లేకుండా గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో తిరుమల, తిరుపతిలో భారీగా వరదనీరు జలాశయాలకు చేరిందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా భారీగా కురిసిన వరదతో నిండుకున్న తిరుమలలోని జలాశయాలను మంగళవారం టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, ఇఇ5 శ్రీహరి,విఎస్‌ఒ నందకిశోర్‌తో కలసి ఛైర్మన్ సందర్శించారు. స్వామివారి అనుగ్రహంతో భారీగా కురిసిన వర్షానికి జలాశయాలు నిండుకోవడం, గోగర్భమ్‌డ్యామ్, పాపవినాశనం,ఆకాశగంగ డ్యామ్‌ల గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. ఈ డ్యామ్‌లను కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. కాగా తిరుమలలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పాంచజన్యం విశ్రాంతి గృహం ప్రాంతంలో భారీ చెట్టు కూలి రెండు కార్లు, ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ఘాట్‌రోడ్లపై పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు.

### బాధితులను ప్రభుత్వం

# అన్నివిధాలా ఆదుకుంటుంది

### -ప్రత్యేకాధికారి శ్యామలారావు



తిరుపతి, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

తుఫాన్‌తో ఇబ్బందుల ప్రతి ఒక్కరిని ప్రభుత్వం అన్ని విధాలాగా ఆదుకుంటుందని తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలారావు అన్నారు.మంగళవారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో తిరుపతి జిల్లా తుఫాన్‌పై తీసుకున్న పలు చర్యలను జిల్లా కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ముఖ్యమంత్రి సూచించిన మేరకు ప్రజలకు అపన్నహస్తం అందించాలన్నారు. తాను పర్యటించిన గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, తిరుపతి రెవెన్యూ డివిజన్లలో విద్యుత్, రహదారులు తదితరాల పనరుద్ధరణ అంశాలపై సూచనలు చేశారు. అదే విధంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ వాతావరణశాఖ, విపత్తు నిర్వహణశాల వారి తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయతో పని చేశారని వివరించారు. జిల్లాలో తుఫాను ప్రభావిత డివిజన్లలోని 15 మండలాల పరిధిలో 17 గ్రామాల్లో 17 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 1293 మంది బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది 20 మంది నిరంతరం తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని, రెవెన్యూ, పోలీసు, శానిటేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇతర ఇంజనీరింగ్, గ్రామ సచివాలయ సిబ్బంది నిమగ్నమై వున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వైభవంగా ఏడు గంగమ్మలకు సారె!

### ఇంటింటా పసుపు నీళ్ళు సమర్పణ







సారెను ఏడుగంగమ్మల అమ్మవారికి అందిస్తున్న ఎంఎల్‌ఏ, గ్రామోత్సవంగా సారె ఊరేగింపు, విశేష అలంకరణలో ఏడుగంగమ్మల అమ్మవారు

.శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు అంగరంగ వైభవంగా సారె బహూకరణ నిర్వహించారు. ప్రతి ఏడాది దేవస్థానం నుంచి ఏడు గంగమ్మలకు సారె బహూకరించే సంప్రదాయం ఉంది.ఈ నేపథ్యంలో ఈ ఏడాది శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి ఉండటంతో ఛైర్మెన్‌అంజూరు తారక శ్రీనివాసులు చొరవ తీసుకొని ఆది నుంచి జాతర కమిటి నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేపట్టారు. అంతేకాక జాతర నిర్వహణలో దేవస్థానం కీలకమైంది.

**కన్నుల పండువగా సారె . ..**

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి మంగళవారం సారె బహూకరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో గంగమ్మలకుఅందించే సారెను సిద్ధం చేసారు.శాసనసభ్యుడు బియ్యపు మధుసూధరెడ్డి దంపతులు హాజరు కాగా ఏర్పాట్లను ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు ౹తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు.ఆలయ ప్రధానా ర్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ పూజలు నిర్వహిం చారు.ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా సారె ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం నుంచి రాజగోపురం ద్వారా తేరువీధిలోకి ప్రవేశించింది.సారె తీసుకెళుతున్న అతిధుల కాళ్ళకుఇంటింటా భక్తులు పసుపు నీళ్ళను సమర్పించారు. ఓ వైపు భక్తులు మొక్కులుతీర్చుకుంటుండగా భక్తి శ్రద్దలతో అతిధులు సారెను ఆయా గంగమ్మలను సమర్పించుకుంటూ ముత్యాలమ్మగుడివీధిలోనిఏడు గంగమ్మలు నిల్చు స్థలంలో సారెను సమర్పించారు. అక్కడ అతిధితులకు పోలసామి స్వర్ణమూర్తి సార ధ్యంలో స్వాగతం పలికారు.సారెకు ముందు ఎలాంటి ఇబ్బంది ల్లేకుండా డివైయస్‌పి భీమారావు,సిఐ అంజూయాదవ్ పర్య వేక్షించారు.ట్రాపిక్‌కు అంతరాయం లేకుండా ట్రాపిక్‌ను రియాజ్ వారి సిబ్బందిపర్యవేక్షించారు.బోర్డుచైర్మెన్ అంజూరు తారక శ్రీనివా సులు,సభ్యులు కొండూరు సునిత, సుమతి, జయశ్యాం,వైకాపాకు చెందిన కొండూరునరసింహారాజు లక్ష్మీవతి, రవి, చంద్రరాజు, కోళ్ళార్యాం హరినాయుడు,రమణయ్యనాయుడు,చింతామణి పాండు పాల్గొన్నా రు. ఆలయాధికారులు ఇఓ రామారావు, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,టెంపుల్ ఇన్సె పెక్టర్ హరియాదవ్ తదితరులు పర్యవేక్షించారు.

## కంప్యూటర్ అక్షరాస్యతపై అవగాహన

వెదురుకుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :

ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకుని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం నేటి సమాజంలో ఎంతో అవసరమని, పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానంతోనే ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలు అభిస్తున్నాయని విద్యార్థులు గుర్తించాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం అవశ్యకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్ రెడ్డి, భరణినాథ్ రెడ్డి, వెంకటేష్, నరేంద్రబాబు, మంగళగౌరీ, నాఆగేశ్వర్‌రావు, భీమ మోహన్ రావు, సతీష్ కుమార్, లావణ్య, పవన్‌కుమార్, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌కు వచ్చే వ్యక్తులకు ఇవిఎంలపై అవగాహన

– జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

కలెక్టరేట్‌కు వివిధ ప్రాంతాల నుండి వచ్చే వ్యక్తులకు ఇవిఎంలపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఓటర్లకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ఇవిఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వివిధ ప్రాంతాల నుండి వచ్చే వక్తులు, కలెక్టరేట్ సిబ్బందికి ఇవిఎంలపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇవిఎంలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆర్డీఓలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పాలు పండ్లు పంపిణీ

బంగారుపాళ్యం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:



స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు మంగళవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపిపి, లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎంబి హిమకర్‌రాజా జన్మదినంను పురస్కరించుకొని ఆయన అభిమానులు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో ఆయన పేరిట పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, ఉప సర్పంచ్ కామరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యువ నాయకుడు ఎంబి దిలీప్, ఈడిక కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప, తగ్గువారిపల్లి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆరోగ్య యాప్‌పై అవగాహన

యాదమరి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:



వైఎస్ఆర్ ఆరోగ్య యాప్‌పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని యాదమరి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. యాదమరి పిహెచ్‌సిలో ఆశా వర్కర్ల సమావేశం సిహెచ్ఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్య యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆరోగ్య పథకం కింద అందిస్తున్న వైద్య సేవలు ఏ ఏ ఆసుపత్రుల్లో ఎలాంటి వైద్య చికిత్సలు పొందాలనే విషయాలు ఈ యాప్‌లో పొందుపరచి వుంటాయన్నారు. అలాగే సర్జరీలకు సంబంధించి సైతం ఈ యాప్‌ల ద్వారానే తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, అనసూయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పథకం చివరన వైఎస్ఆర్ పేరును తొలగించండి

– ఏపికి రూ.5300 కోట్లు నిలిపేసిన కేంద్రం

– హౌసింగ్ డిఎంకు వినతి చేసిన భాజపా నాయకుడు చిట్టిబాబు

చిత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం చివరన వైఎస్ఆర్ పేరు చేర్చడంతో కేంద్రం పెద్ద మొత్తంలో నిధులను విడుదల చేయకుండా ఆపేసిందనీ, వెంటనే వైఎస్ఆర్ పేరును తొలగించాలని కోరుతూ బిజెపి సీనియర్ నాయకుడు చిట్టిబాబు గృహనిర్మాణ శాఖ, జిల్లా మేనేజరును కలసి వినతి చేసారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద ఇచ్చిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీచేసిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పథకం చివరన వైఎస్ఆర్ అని సొంత బ్రాండ్ ఏర్పాటు చేసుకొని తామే ఇళ్ల నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసుకొంటున్నారన్నారు. దీంతో రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.5,300 కోట్ల నిధులను కేంద్రప్రభుత్వం ఆపేసిందన్నారు. వైకాపా సొంత పబ్లిసిటీ కారణంగా పేదలు నష్టపోతున్నారనీ, నిధులలేమి కారణంగా ఇళ్ల నిర్మాణం జాప్యం అవుతోందన్నారు. అర్బన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 21,32,432 ఇళ్లు మంజూరు చేస్తే నేటికి కేవలం 8,64,743 ఇళ్లను మాత్రమే పూర్తి చేసారని, గ్రామీణ పథకం కింద రాష్ట్రానికి 2,46,430 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు కేవలం 62,886 ఇళ్లు మాత్రమే పూర్తి చేసారన్నారు. ఈ పథకం మార్చి 2024తో ముగిసిపోతుందనీ, వెంటనే వైఎస్ఆర్ అక్షరాలు తొలగించి, కేంద్రం విడుదల చేసిన పథక మార్గదర్శకాల అనుగుణంగా మార్పులు చేసి పేదలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. జిల్లామేనేజరును కలిసిన వారిలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, జిల్లా మీడియా ఇంఛార్జీ ఎంజి రామభద్ర తదితరులు వున్నారు.

## జ్యోతిష్య శాస్త్రసపండితులు ఆంజనేయవర్మకు గౌరవ డాక్టరేట్

ఐరాల, డిసెంబర్ 5 ప్రభాతవార్త:




మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ ఆర్ట్ యూనియన్ (ఎంబిఆర్) న్యూఢిల్లీ అనే సంస్థ మండలంలోని నాంపల్లెకు చెందిన జ్యోతిష్య శాస్త్రపండితుడు ఆలూరు ఆంజనేయశర్మకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసి సత్కరించారు. గత నాలుగు దశాబ్దాలుగా జ్యోతిష్య, వాస్తు పంచాంగాల ద్వారా ప్రజలకు అందుబాటులో వుండి అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఎంబిఆర్ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు డాక్టర్ మనోజ్ బాటియా చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ గనగల్ల విజయ్‌కుమార్, డాక్టర్ చిత్రాల గురుమూర్తి గుప్త, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రముఖులు పాల్గొన్నారు.

## పాడి రైతులు రాయితీ దాణను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :



పాడి రైతులకు ప్రభుత్వం అందచేస్తున్న రాయితీ పశుదాణను సద్వినియోగం చేసుకోవాలని మండల గృహసారధుల కమిటీ కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధిలో పశువులకు కావలసిన సంపూర్ణ సమీకృత మిశ్రమ దాణ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ సమీకృత మిశ్రమదాన పశువులకు వేయడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పాడి రైతులకు 60 శాతం రాయితీ కింద దాణ అందజేయడం జరుగుతుందని రైతులు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బట్టే రమణమ్మ, వైఎస్ సర్పంచ్ కేశవులు, సచివాలయం కన్వీనర్ వెంకటేష్, పశుసంవర్ధశాఖ వైద్యులు రాజేష్, పశుసంవర్ధక సహాయకురాలు జరీన, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వృత్తిలో ఒదిగుండే తత్వం రవికుమార్ సొంతం

చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త



పోలీసు వృత్తిలో ఒదిగుండే తత్వం రవికుమార్ సొంతమని పలువురు కొనియాడారు. మండల ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ మదనపల్లి తాలూకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన రవికుమార్‌కు స్థానిక మండల పరిపాలనా భవనంలో రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు అధ్యక్షతన వీడ్కోలు సభ జరిగింది. మండలానికి వచ్చిన రెండన్నర యేళ్ళల్లో ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నారనీ, శక్తిక్షేత్రం బోయకొండతోపాటు సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతలకు ఆయన చూపిన చొరవ అభినందనీయమన్నారు. అనంతరం రవికుమార్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, రాష్ట్రయువకాపునాడు అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, మాజీ ఎంపిపి శ్రీరామ్‌రెడ్డిప్రకాస్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, వైకాపా మైనార్టీ అధ్యక్షుడు అల్తాఫ్, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, రూపారమేష్, మండలంలోని సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఈ రోడ్డుపై ఎలా నడవమంటారు...?

చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త



చినుకు పడితే చిత్తడయ్యే ఈ దారిలో ఎలా నడవమంటారని నేతాజీనగర్‌వాసులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండుకు పక్కనే వున్న ఈ మార్గంలో రైతు భరోసా కార్యాలయం వుంది. అంతేకాకుండా పొలాలకు వెళ్ళే రైతులు, కుటుంబాలవారు ఆ మార్గంలో నడుస్తున్నారు. చినుకు రాలితే చిత్తడిగా వుంటూ గుంతలమయంగా వున్న రోడ్డుపై నడవాలంటేనే స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పలువురు ద్విచక్రవాహన దారులు రోడ్డుపై పడి క్షతగాత్రులయ్యారు. అధికారులు, పాలకులు స్పందించి నేతాజీనగర్ రోడ్డు సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆడ,మగ పిల్లల్న సమానంగా చూడాలి : ఎపియం

వెదురుకుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :



ఆడ మగ పిల్లల మధ్య వ్యత్యాసం లేకుండా సమానంగా చూడాలని ఎపియం కవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద శనివారం ఎండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ, మగ బిడ్డల మధ్య తారతమ్యం లేకుండా సమానంగా చూడాలని సూచించారు. వివక్ష విధానం వీడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం సంఘమిత్రాలు, వివో లీడర్లు. సీసీలచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, మహిళ సంఘాల సభ్యులు, సంఘమిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నీట మునిగిన వరి నాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

వెంకటగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త



తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీటిలో మునిగిన వరి నాట్లను ఏడిఏ నాగార్జున సాగర్ ఏవో సుజాత పరిశీలించారు. మండలంలోని వల్లివేడు, కె ఉప్పరపల్లి, జీకేపల్లి గ్రామాల్లో వారు పర్యటించి నీటిలో మునిగిన వరినాట్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. 462 ఎకరాలలో వరినాట్లు వేసి ఉన్నారని 162 యక్టర్లలో వరినాట్లు నీట మునిగి ఉండొచ్చని తెలిపారు. రైతుల పంటలను అంచనా వేసి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

## కుప్పంలో కొత్త ఓటర్ల దరఖాస్తుల కంటే తొలగింపు దరఖాస్తులే అధికం !!

–అధికారుల పరిశీలనలో ఓటర్ల నమోదు.. తిరస్కరణ క్లెయిమ్‌లు

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

2024లో జరిగే ఎన్నికలకు సంబంధించి రానున్న జనవరి నెలలో ఎన్నికల అధికారులు తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 2,3 తేదీల్లో పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటివరకు కుప్పం నియోజకవర్గంలో కొత్తగా ఓటర్ల నమోదుకు 17523దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 11143దరఖాస్తులను అంగీకరించగా 2559 దరఖాస్తులు తిరస్కరించారు. ఇంకా 3821దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. అలాగే ఓట్ల తొలగింపుకై ఫారం 7కింద 21362 క్లెయిమ్‌లు రాగా 10427 దరఖాస్తులు అంగీకరించారు. 7268దరఖాస్తుల్ని తిరస్కరించారు. ఇంకా అధికారుల పరిశీలనలో 3667 దరఖాస్తులు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు నియోజకవర్గంలో కొత్తగా 13097ఓటర్లను చేర్చగా 15114ఓట్లను తొలగించినట్లు సమాచారం. కుప్పం నియోజకవర్గంలో డిసెంబర్ 1నాటికి మొత్తం 218863మంది ఓటర్లు నమోదై ఉన్నారు. వీరిలో పురుషులు 109396మంది కాగా మహిళలు 109448, ఇతరులు 19మంది ఉన్నారు. డిసెంబర్ నాటికి కుప్పం నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 2019 ఎన్నికల నాటికి నియోజకవర్గంలో 2,13146మంది ఓటర్లు ఉండేవారు. ఈ లెక్కన నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు ఐదువేల ఓట్లు పెరిగాయని తెలుస్తోంది. కాగా గతంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 263 పోలింగ్ బూత్‌లు ఉండగా ఈసారి ఈసంఖ్య 243కు చేరనున్నట్లు తెలిసింది.

## జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా షేక్ సయ్యద్ సాహెబ్ నియామకం

తిరుపతి మహిళావర్సిటీ, డిసెంబర్ 5, ప్రభాతవార్త



తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తిరుపతి జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా షేక్ సయ్యద్ సాహెబ్ నియామకం పట్ల తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి, చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడిగా, తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంపెక్స్ పరిపాలనాధికారిగా అనేక సంవత్సరాల నుండి ఉత్తమ సేవలు అందించారని, క్రీడల అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారని అటువంటి అధికారిని తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అధికారిగా నియమించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆయనని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీధర్, కోశాధికారి జివిస్ సాయికుమార్ ఘనంగా దుశాలువతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షాప్ శిక్షకులు ఆదినారాయణ, హిందూజా, సాయి సుమతి, నీలిమ, విజయ మోహన్ రెడ్డి, సూర్య కళ పాల్గొన్నారు.

# జలమయం..నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

దొరవారిసత్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

మిచౌంగ్ తుపాను ఒక్కసారిగా విజృంభించడంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం అయ్యాయి. రెండురోజులు నుంచి జోరు వర్షాలకు తోడు తుపాను చేరడంతో లోతట్టు ప్రాంతాలు, పల్లెలు గడగడలాడాయి. విపరీతమైన చలిగాలులు, ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో ఇళ్ల నుంచి బయటకు రాలేక ప్రజలు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలన్ని నీట మునిగాయి. దొరవారిసత్రం మండల పరిధిలోని పూలతోట, బురదమడుగు, వేటగిరిపాలెం, తనయాలి గిరిజన కాలనీ, అక్కరపాక, మావిళ్లపాడు, విఎస్ఆర్ నగర్, మినమనముడి తదితర గ్రామాల్లో ఒడ్డున ఉన్న కాళంగి నది పొంగి పొర్లడంతో వరద నీరు దిగువ ప్రాంతాల్లోకి చేరి ఆ రోడ్లన్నీ నీటమునిగాయి. దీంతో గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరద ఎటూ వెళ్లకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలో ఉన్న గృహోపకరణాలన్నీ వరద నీటికి తడిసి పాడయ్యాయని లబోదిబోమంటున్నారు. దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు, తనయాలి బ్రిడ్జి వద్ద వాహనాల రాకపోకలు స్తంభించాయి. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామాల నుంచి పొట్టకూటి కోసం తడకు సమీపంలో ఉన్న కంపెనీలలో ఉద్యోగాలకు వెళ్లిన కార్మికులకు తనయాలి, బూదూరు తదితర గ్రామాల్లోకి వెళ్లడానికి దారి లేక రోడ్లపైనే కాలిబాటన నడిచి చివరికి రోడ్డుపైనే ఉండిపోయారు. ఓ కంపెనీ కార్మికులను వారి ఇళ్లకు తరలించడంలో అధికారులు విఫలమయ్యారు. పేరుకే అక్కడక్కడ తుపానుపై ప్రత్యేక నిఘా అంటూ వసతులు ఏర్పాటు చేశామన్నారే గాని ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో తుపాను బాధితులకు వసతులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని పలువురు వాపోతున్నారు. తనయాలి గ్రామంలో నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలు, కార్మికులు, వలస కూలీల పట్ల సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదని పలువురు వాపోతున్నారు. వేలఎకరాలవరిపంట,వందలాది ఎకరాల మిరప తదితర పంటలు నీట మునిగాయి. విఎస్ఆర్ నగర్, వింఆర్,బురదమడుగు, తనయాలి గిరిజన కాలనీ తదితర గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. నీరు ఎటూ వెళ్లలేనిపరిస్థితిఉండటంతోప్రజలుఇబ్బందులుపడుతున్నారు.నీళ్లుచేరడంతో పూరిళ్లు పూర్తిగా పాడయ్యాయి.

### కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని చుట్టుముట్టిన వరద

ఏకొల్లు గ్రామంలో చెరువు కట్ట తెగిపోవడంతో చెరువు నీరు మొత్తం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని చుట్టుముట్టాయి. దీంతో వసతిగృహంలో ఉన్న బాలికలను స్థానిక సర్పంచ్ ఆవుల బ్లెస్సీ, కుటుంబ సభ్యులు, పలువురు యువకులు, ఎస్ఐ జె.తిరుమలరావు తదితరులు బయటికి తీసుకొచ్చారు. అలాగే వెదురుపట్టు గ్రామ చెరువు కట్ట తెగడంతో గ్రామస్థులు చెరువు కట్టను బాగు చేయడానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఇసుక బస్తాలతో నీటికి అడ్డుకట్ట వేశారు. ఎక్కడా కూడా అధికారులు మాత్రం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం చాలా గ్రామాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రెండురోజుల నుంచి గ్రామాల్లో అంధకారం

రెండురోజుల నుంచి పల్లెల్లో అంధకారం నెలకొంది. మిచౌంగ్ తుపాను కారణంగా వర్షాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి తీగలు తెగిపోయాయి. మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు సరఫరా పునరుద్ధరించడానికి ప్రయత్నం చేశారు. గ్రామాల్లో సుమారు 60 విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు అధికారులు చెప్పున్నారు.

## ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు - ఆర్డీఓ శ్రీనివాసులు



కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ శ్రీనివా సులు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా శని,ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లలో వచ్చిన దరఖాస్తులు, తిరస్కరణ దరఖాస్తులు, ఓటర్ల వివరాలు మార్పు తదితర అంశాలపై చర్చించారు. కాగా పొట్టకూటి కోసం వలస వెళ్లిన వారి ఓట్లను యధావిధిగా కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆర్డీఓను కోరారు. కాగా జనవరి నెలలో తుది ఓటరు జాబితా వెలువడుతుందని అంతకుముందే సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీలకు అందిస్తా_మన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీల నేతలు శివశంకర్, మురుగేష్, కేశవరాజు, తహశీల్దార్ పార్వతి తదితరులు పాల్గొన్నారు

## ఎస్వీయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం

తిరుపతి క్రీడ, డిసెంబర్ 5, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ఈనె 6వ తేది ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆచార్య కట్టమంచి రామలింగారెడ్డి పేరుతో ఈ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం చేపట్టనున్నారు. ఆధునిక సాహిత్య విమర్శ దృక్పథాలు అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి. అరుణకుమారి ప్రసంగిస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. వర్సిటీ ఇన్చార్జి వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాహిత్యవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ తెలిపారు.

## నేడు కులగణన సర్వేపై రౌండ్ టేబుల్ సమావేశం

శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు బుధవారం మండల కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు కులగణన సర్వేపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ హేమమాలిని తెలిపారు. ఎంపిపి, జడ్పీటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు తప్పక ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## కేంద్ర పథకాల్ను పేదలకు చేరాలన్నదే ధ్యేయం

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన పథకాలు పేదలకు చేరాలన్నదే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బిజెపి కుప్పం ఇన్‌చార్జ్ శివశంకర్ పేర్కొన్నారు. కృష్ణదాసనపల్లి పంచాయతీ మటార్లపలి ల్లలో మంగళవారం వికసిత్ భారత్ స ంకల్ప్‌యాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక వాహనంలో కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్, ఉజ్వల గ్యాస్, పిఎం కిసాన్ సమ్మాన్ తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, భరత్‌కుమార్, ఎంపిడిఓ ఖాదర్ బాషా, ఇఒపిఆర్‌డి విజయదత్, ఎఓ అమృతవల్లి, సర్పంచ్ సరస్వతి మోహన్, ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ సెమినార్ వాల్డిక్టర్ సెషన్‌పై నివేదిక

తిరుపతి (మహిళావర్సిటీ), డిసెంబర్ 5, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఐఎస్‌సిఎ తిరుపతి చాప్టర్‌తో కలిసి సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ నిర్వహించింది. ఇది శోభాయమాన కార్యక్రమంతో ముగిసింది. ఈ సెమినార్‌లో వివిధ కళాశాలల విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు. 8 టెక్నికల్ సెషన్లలో 210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 95 మంది విద్యార్థులు పత్రాలను సమర్పించారు. ప్రదర్శనల అనంతరం సమారాధన నిర్వహించారు. ఎస్పీఎంవీవీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొ. ఎ. శ్రీదేవి సెమినార్ నివేదికను సమర్పించారు. అనంతరం ముఖ్య అతిధి ప్రొపెసర్ డి. భారతి, వైస్ ఛాన్సలర్, ఆమె ప్రసంగంలో వివిధ రంగాలలో ఉన్న మహిళలను హైలైట్ చేశారు. అతిధిగా విచ్చేసిన ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్. రామమూర్తి పరిశోధనలో సుస్థిరత ఆవశ్యకతను చెప్పారు. సెమినార్ కన్వీనర్ డా. కె. పూర్ణచంద్రరావు ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది. ఈ సెమినార్‌లో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ప్రొ. పి. జోత్స్న, ప్రొ. ఆర్. జయ మాధురి,


**IN THE DEBTS RECOVERY TRIBUNAL-2**
**I FLOOR, TRIVENI COMPLEX (PALACE HEIGHTS)**
**ABIDS, HYDERABAD-500 001.**
**O.A.No. 692 OF 2023**

BETWEEN :
**CANARA BANK,** M.R.PALLI BRANCH, TIRUPATI, ANDHRA PRADESH ...APPLICANT

AND

**M/s. BEST WINDOWS SYSTEMS and another ...DEFENDANTS**

01. M/s. **BEST WINDOWS SYSTEMS,** Represented by its Proprietor, D.No.389, Shop No.1, Avilala Bangalore High Way, Near AP03 Drive in Restaurant, TIRUPATI-517 501, ANDHRA PRADESH.

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

Please take the summons in the above O.A.No.692/2023 filed by the applicant for recovery of money of **Rs.30,86,496.75ps** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VARTHA"** daily newspaper and posted the matter to 22.12.2023.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;

(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;

(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;

(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **22.12.2023 at 10.30 a.m.** at Debts Recovery Tribunal-2, I Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that In case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day **05th day of DECEMBER, 2023.**

(By order of the Tribunal)

**REGISTRAR,**
**DEBTS RECOVERY TRIBUNAL-2**
**HYDERABAD**

## నిర్వాసిత బాధితులను ఆదుకున్న లోకా ఫౌండేషన్ సంస్థ

వరదయ్యపాలెం, డిసెంబర్ 5, ప్రభాతవార్త




గత రెండు రోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు లోకా పౌండేషన్ సంస్థ ఎస్టీ కాలనీ వాసులను ఆదుకున్నారు. అలాగే జేసిబి సహాయంతో రోడ్డుకి అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జేసిబి ద్వారా మొక్కలు తొలగించారు. అనిల్ పురం బిజిఆర్ ఎస్‌టి కాలనీ గ్రామస్తులను పునరావస కేంద్రాలకు అధికారులు తరలించారు. వీరికి లోక పౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ ట్రస్ట్ జనరల్ మేనేజర్ సునీల్ జీ ఆధ్వర్యంలో బాధితులకు భోజన వసతి ఏర్పాట్లు తుఫాను ప్రభావం తగ్గేంత వరకు వారు ఉండడానికి వసతులు ఏర్పాటు చేశారు. ఎస్టీ కాలనీలోని గ్రామాలు నీట మునగడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు నానా అవస్థలకు, ఇబ్బందులకు గురవుతు న్నారని అధికారులు, స్థానికుల ద్వారా తెలుసుకున్న లోకా ఫౌండేషన్ ట్రస్టు మేనేజర్ సునీల్ జి వెంటనే స్పందించి బాధితులకు ఆహారాన్ని గత రెండు రోజులుగా అందించారు. వరద బాధితులకు అండగా నిలిచినందుకు లోకా ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు, బాధితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నిండిన చిట్టత్తూరు పెద్దచెరువు-గండికొట్టిన గ్రామస్తులు

.తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త



ఇప్పటికే తెలుగుగంగ నీటితో మండలంలోని చెరువులన్నీ నిండిపోయా యి. అయితే రెండు రోజుల నుంచి కురిసిన మాండోస్ తుఫాను ప్రభావంతో మండలంలోని చిట్టత్తూరు పెద్దచెరువు పూర్తిగా నిండడంతో ఇబ్బందులు లేకుండా సర్పంచ్ కృష్ణమూర్తి, అధికారులు, గ్రామస్తుల సమక్షంలో గండికొట్టించి నీటిని బయటకు విడుదల చేయడంతో గ్రామస్తులు హమయ్యా అని ఊపిరిపీల్చుకున్నారు. ఇక కారాకొల్లు పంచాయతీ దొంగలముదూరు గ్రామం చెరువు కింద ఉన్న వరవకాలువకు గండిపడడంతో కాలువకింద వేసిన వరినార్లు నీటిప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఇక రాంబట్లపల్లిలో రైతుల పంటపొలాలు చెరువులను తలపిస్తూ వరిపైరు పూర్తిగా నీటమునిగిపోయాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు కూడా చిట్టత్తూరు పెద్దచెరువు నిండిపోగా గండికొట్టి నీటిని బయటకు తరలించారు. ఇక తహశీల్దార్ సుధీర్‌రెడ్డిలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న దళితవాడ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజన సౌకర్యాలు కల్పించారు. ఇక ఇరిగేషన్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షిస్తున్నారు. అయితే మంగళవారం ఎలాంటి వర్షం లేకపోవడంతో అధికారులు హమయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు.

## గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తం-వర్షానికి కొట్టుకుపోయిన దయనేడు రోడ్డు

-చెంబేడు కాలువ నిండి పంటపొలాల్లోకి చేరిన నీరు

.తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త





మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం ఉదయం 9గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఏకదాటిగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో గ్రామాల్లోని ప్రజలు అవస్థలకు గురయ్యారు. సోమవారం రాత్రి 8గంటల నుంచి మంగళవారంవారం ఉదయం 8.30గంటల వరకు మండలంలో 234.3మి.మీ వర్షపాతం నమోదైంది. శ్రీ ఇక రామచంద్రాపురం గ్రామానికి వెళ్ళే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు పడిపోవడంతో తహశీల్దార్ స్పందించి వెంటనే చెట్లును తొలగించి ట్రాఫికకు ఎలాంటి అంతరాయం లేకుండా చేశారు. ఇక పసనకోన కాలువ నుంచి నీటి ఉధృతి ఎక్కువవుతోంది. బోనుపల్లికి వెళ్ళే మార్గంలోని కాళంగినది, దొంగలముదూరు వద్ద ఉన్న గుండ్లమడుగువాగు, చోడవరం గ్రామానికి వెళ్ళేదారిలో వాలంగలమందపై స్వర్ణముఖి నీటి ప్రవాహం ఎక్కువవడంతో ఈమార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. ఇక అన్నదాతలు వేసిన వరిపంటలు నీట మునిగి చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. దళితవాడల్లో ఉంటున్న వారు బిక్కుబిక్కు మంటూ నివాసం ఉంటున్నారు. పనులు లేక పస్తులు ఉంటున్నారు. బోనుపల్లి కట్టకు అవతల ఉన్న వారిని పట్టించుకునే దిక్కులేదు. ఇక తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ గది ఉరుస్తోంది. ఇక్కడ ల్యాప్‌ట్యాబ్‌ల కింద గొడుగులు పెట్టుకుని పనిచేసే పరిస్థితి తలెత్తింది. ఇక రికార్డు గదికి మరమ్మత్తులు చేయించడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు. అయితే రికార్డులు మాత్రం మరో గదిలోకి మార్చడంతో హమయ్యా అంటూ అందరు ఊపిరిపీల్చుకున్నారు. తహశీల్దార్ సుధీర్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కార్యాలయంలోకంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. ఇక తొట్టంబేడు ఎంపిడిఓ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు. పెద్దకనపర్తి, చిన్నకనపర్తి, దయనేడు రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దయనేడు రోడ్డు వర్షానికి కొట్టుకుపోవడంతో ఈమార్గంలోరాకపోకలు లేవు. ఇక పొయ్య గ్రామం వద్ద ఉన్న చెంబేడు కాలువ 9మీటర్లు ఉండగా మెగా కంపెనీ పుణ్యమా అంటూ చిన్నదిచేయడంతో కాలువలో నీళ్ళు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి చేరడంతోపాటు గురుకులపాళెం, కొమ్మనగుంట, పొయ్య, లింగమనాయుడుపల్లి గ్రామాల్లోని పంటపొలాలు చెరువుల్లా మారాయి. దీంతో మండల వైకాపా సీనియర్‌నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు ఇరిగేషన్ ఇఇ మదనగోపాల్‌కు సమాచారం అందించగా ఆయన జెసిబిల సాయంతో నీటిని తొలగించేందుకు ప్రత్యామ్నాయం ఏర్పాటచేశారు. ఇక కొత్తకండ్రిగ గ్రామంలోనీటి ప్రవాహం, కత్తివారికండ్రిగ వద్దరోడ్లు ధ్వంసం అయ్యాయి. ఇక చిట్టత్తూరు పంచాయతీ గణపతి ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న వారిని పంచాయతీ కార్యదర్శి భార్గవ్ సత్యం వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇక సాంబయ్యపాళెం చెరువు నిండి కలుజునీరు సచివాలయం వద్ద ఉధృతంగా నీరుచేరడంతో ఈమార్గంలో కూడా ఎవ్వరినీ అనుమతించలేదు. పక్కనే పాఠశాల ఉంది. అయితే సెలవు ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక కొండ్రాజుపల్లి గ్రామంలోని హరిజనవాడలో మూడు తాటిచెట్లు ఇండ్లపై పడడంతో ప్రమాదం తప్పింది. ఈదురుగాలుల ప్రభావం వల్ల మరో కొన్ని చెట్లు పడే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో తహశీల్దార్ స్పందించి అక్కడకి వెంటనే సిబ్బందిని పంపించారు. ఇక కాసారం మార్గంలోసున్నపుకాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏది ఏమైనా మిచౌంగ్ తుఫాను ప్రభావం మండలాన్ని అతలాకుతలం చేసిందని చెప్పవచ్చును.

## తుఫాను బాధితులను ఆదుకుంటాం :

ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



తుఫాన్‌తో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం నివేదిక వెంటనే తయారు చేసి పంపాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా నారాయణవనంలో పాలమంగళంలో కొట్టుకుపోయిన కాజ్‌వేలను పరిశీలించారు. కురుస్తున్న భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న వరదనీటితో ఉధృతంగా ప్రవహించడంతో అరుణానదిని దాటడానికి వీలులేదన్నారు. అలాగే మండలంలో సుమారు 138మంది చెందిన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు చెప్పారు. వారందరిని ప్రభుత్వ పరంగా తప్పక ఆదుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు, మూగజీవాలు, పంట నష్ట బాధితులందరిని ఆదుకుంటామన్నారు.

## తుఫానుతో పంటలకు నష్టం

జన జీవనం అస్తవ్యస్తం



పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:

తుఫాను కారణంగా పుత్తూరు మండలంలో కొన్ని గ్రామాల్లో వేపగుంట, నేసనూరు, తొరూరు గ్రామాల్లో వరి, వేరుశనగ, కూరగాయల పంటల నష్టం జరిగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పుత్తూరు మున్సిపాలిటీ, గ్రామీణ మండలాల్లో జన జీవనం అస్తవ్యస్తమైంది. పుత్తూరు మండలంలో వరి 15 హెక్టార్ల, వేరుశనగ 11 హెక్టార్ల, కూరగాయలు 2 హెక్టార్లు నష్టానికి గురైనట్లు అధికారులు అంచనా వేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గంగమాంబపురంలో వరి పంట ముంపుకు గురైంది. నేషనల్ వద్ద కాజీపేట నీటి ఉధృతి కారణంగా రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీనిపైన తగు విధమైన చర్యలు ఈ తుఫాను ప్రభావం ఇంక రెండు, మూడు రోజులు ఉండడం వలన రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేసి పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి కోదండయ్య తెలిపారు.

## రోజా ఛారిటబుల్ ట్రస్ట్ అండ

చింతలపట్టెడ హరిజనవాడలో 60 కుటుంబాలు, వేలావడి ఎస్టీ కాలనీలో 70, ఎం.కొత్తూరు ఎస్టీ కాలనీలో 20 మొత్తం 150 కుటుంబాలకు రోజా ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ప్రభుత్వం అందించే సహాయం కంటే ముందుగానే బాధిత ప్రాంతాల్లో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పర్యటించి రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బియ్యం, నూనె, కందిపప్పు, కూరగాయలు అందించడంతో బాధితులు ఊరట చెందారు. వర్షాల వల్ల ఇళ్లలోకి నీరు వచ్చి నిత్యాసవర వస్తువులకు ఇబ్బంది పడే సమయంలో రోజా ట్రస్ట్ ఆదుకోవడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ప్రతి బుధవారం నగరి, పుత్తూరు ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణీలకు మధ్యాహ్నం ఉచిత బోజన సదుపాయాన్ని గత అయిదేళ్లుగా రోజా ఛారిటబుల్ ట్రస్ట్ కల్పిస్తోంది. కరోనా సమయంలో కూడా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించి రోజా ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తుపాను బాధితులకు కూడా ట్రస్ట్ తరపున సహాయం అందిస్తున్నామని, అవసరమైన వారికి మరింత సహాయం చేయాలని మంత్రి ఆదేశించినట్టు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## రాయల చెరువు పటిష్టతకు చర్యలు చేపట్టండి..!

ముంపు గ్రామాల బాధితులకు అండగా వుంటా..!

టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని

రామచంద్రాపురం, డిశంబర్ 5 ప్రభాతవార్త:



తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రాయల చెరువుకు క్రమేనా నీటి వరద పోటెత్తుతుందని చెరువు పటిష్టతకు ప్రభత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని టిడిపి చంద్రగిరి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు అయిన రెండు నెలలకే ముంపు గ్రామాల బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వం నుండి పరిహారం ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. మంగళవారం ఆయన రాయలచెరువు, నక్కల గండి, కుక్కలగండి తూములను పరిశీలించారు. అనంతరం కుప్పం గ్రామం వద్ద ఆర్అండ్‌బి రోడ్డుపై గల వంతెనను మూసివేయడంతో ముంపుకు గురైన రైతుల పొలాలను, బాదూరు చెరువు మొరవకు కొట్టిన గండిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, కొట్టే నరశింహారెడ్డి, మహేష్ నాయుడు, సాయి ప్రసాద్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, సురేంద్ర నాయుడు, మధుసూదన్ రెడ్డి, ధనంజయ రెడ్డి, మాదవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని విధాలా ఆదుకుంటాం - ఎమ్మెల్యే భరోసా

రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త:



తుఫాను కారణంగా నష్టపోయిన కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటానని, అందరికి తానున్నానంటూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రేణిగుంట మండలం కుర్రకాలువలో భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే సందర్శించారు. బాధితుల కష్ట సుఖాలను అడిగి తెలుసుకుని జరిగిన నష్టాన్ని ఆరా తీశారు. తుఫాను వల్ల ఇళ్ళలోకి నీరు చేరి వంట చేసుకోలేని వారికి భోజనాధి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో చేరిన నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాను తక్షణం పునరుద్ధరించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా వీధి లైట్లు వెలిగేలా చేయాలని విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. సత్వర సాయం అందిస్తామన్నారు. బాగానష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. లబ్ధిదారులందరికి తక్షణం బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్‌ను కోరారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, సీనియర్ పార్టీ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, స్థానిక నేతలు శీను, వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడకండి...బాధితులకు అండగా వుంటా..

గాలి భానుప్రకాశ్

పుత్తూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త



గత మూడు రోజులుగా మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన నగరి మండలం వేలావడి ఎస్టీ కాలనీ, కృష్ణరావమ్మపురం ఆదిఆంధ్ర వాడ ప్రజలను మంగళవారం తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ పరామర్శించారు. బాధిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి అండగా వుంటాను, అధైర్యపడకండి అని భరోసా ఇచ్చారు. బాధితులకు బియ్యం, తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అలాగే నింద్ర, విజయపురం, వడమాలపేట, పుత్తూరు మండలాలో పర్యటించి వర్షాలకు మునిగిపోయిన వేరుసెనగ, వరి, మిరప, చెరకు పంటలను పరిశీలించారు. పంటలు నీట మునిగిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద నీటి ముంపు బాధితులను ఆదుకోవాలని, అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. బాధితులకు టిడిపి అండగా వుంటుందని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## నేల, నీరు జీవరాశికి జీవనాధారం

తిరుపతి క్రీడా, డిసెంబర్ 5, ప్రభాతవార్త



ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల సహకారంతో మొక్కలు నాటారు. ఈ ఏడాది నినాదం నేల, నీరే జీవరాశి అంతటికి జీవనాధారం అని మానవాళికి అత్యధిక ఆహారాన్ని అందిస్తున్న నేలను పరిరక్షించుకోవాలని, నీటిని పొదుపుగా వాడి నీటి సంరక్షణా యాజమాన్య పద్ధతుల ద్వారా భావితరాలకు నీటిని అందించాలని పిలుపునిచ్చారు. మన భూమి మనుగడ మట్టి నీరు పై ఆధారపడివుందని, ఈ రెండిటి సంబంధమే వ్యవసాయ వ్యవస్థకు పునాదన్నారు. ఆహారభద్రత, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు, మానవశ్రేయస్సు కోసం నేల నాణ్యత యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. ప్రియవర్ధన్ బాబు, వై. గంగాధర్ రావు, కె. కృష్ణ కిశోర్, పి. రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద నీటి తరలింపులో చంద్రగిరి ఈఓ మహేశ్వరయ్య

చంద్రగిరి, డిశంబర్ 5 ప్రభాతవార్త:



మిచౌన్ తుఫాన్ తీవ్ర నేపధ్యంలో రాయలపురం పంచాయతీలో రోడ్డుపై నిలిచిపోయిన వరద నీటిని తరలించడంలో చంద్రగిరి పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య చొరవకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయలపురం పంచాయతీలో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజల వినతి మేరకు ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి ఇక్కడికి చేరుకుని వరదనీటిని తొలగించాలని చంద్రగిరి ఈఓను ఆదేశించారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఉదయం ఇక్కడికి చేరుకున్న ఈఓ కార్మికులతో కల్వర్టును శుభ్రం చేయించడంతో పాటు వరదనీటి ప్రవాహానికి చర్యలు చేపట్టారు. రాయలపురం పంచాయతీ ప్రజలతో పాటు వాహన చోదకుల సమస్యకు పరిష్కారం లభించడంతో హర్షం వ్యక్తం చేశారు.

## మిచౌంగ్ తుఫాన్ తీవ్రతపై అప్రమత్తంగా వుండాలి..!

అత్యవసర సేవలకు 1912 కాల్ చేయండి..!

యుద్ధప్రాతిపధికన విద్యుత్ సేవలు పునరుద్ధరణ

ఈఈ వాసు రెడ్డి

చంద్రగిరి, డిశంబర్ 5 ప్రభాతవార్త:



మిచౌంగ్ తుఫాన్ తీవ్రత నేపధ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని విద్యుత్ అధికారులను ఈఈ వాసు రెడ్డి ఆదేశించారు. తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తినట్లయితే ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యహరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా అత్యవసర సేవలందించే ఆసుపత్రులకు తప్పనిసరిగా విద్యుత్ సరఫరా వుండే విధంగా చూసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావానికి తెగిపడే లైన్లు, విరిగిపోయే విద్యుత్ స్థంభాలు, మరమత్తులకు గురై ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయడానికి అవసరమైన పరికరాలను, యంత్రాంగాన్ని, సిబ్బందిని అందుబాటులో వుండే విధంగా చూసుకోవాలని ఏఈలను ఆదేశించారు. తుఫాన్ కారణంగా ఎక్కడైనా ప్రజలకు అసౌకర్యం ఏర్పడితే వెంటనే 1912 నంబర్‌కు గానీ మీ సమీప సబ్ స్టేషన్‌కు గానీ కాల్ చేయాలని కోరారు. విద్యుత్ అంతరాయాలపై వచ్చే ఫిర్యాదులను, సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రతి సెక్షన్ ఆఫీసు (ఏఈ ఆఫీస్) నందు కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏడిఈలు శేషాద్రి రెడ్డి, నరేంద్ర, సతీష్ చంద్ర, పరిశుద్ధరావు, ఏఈలు నాగరాజ, హరిప్రసాద్, రజనీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నిరంజన్ బాబు

రామచంద్రాపురం, డిశంబర్ 5 ప్రభాతవార్త:



సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. జెఎన్‌టియూ వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అవార్డులు ప్రధానం చేశారు. వెంకట్రామాపురం వద్ద గల సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో మౌళిక వసతుల కల్పన, నూతన ఔషధాల తయారీలో విశిష్ట సేవలందిస్తున్న ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబును ఉత్తమ ప్రిన్సిపాల్‌గా గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు.

## పాలమంగళం ఉత్తరపుకండ్రిగ యానాధికాలనీవాసులను ఆదుకోండి

నారాయణవనం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మండలంలోని పాలమంగళ ఉత్తరపుకండ్రిగ యానాధికాలనీకి పూరిళ్లు పూర్తిగా దెబ్బతిన్నది. మరో 20 పూరిళ్లకు నీళ్లు చేరడంతో తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. కురుస్తున్న వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. తప్పక జిల్లా కలెక్టర్‌కి నివేదిక పంపి తప్పక ఆదుకుంటామని సర్పంచ్ సాయిరవి భరోసా ఇచ్చారు.

## చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకోండి

నారాయణవనం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షంతో నారాయణవనం మండలంలోని నారాయణవనం, తుంబూరు వీవర్స్‌కాలనీ, తుంబూరు, పాలమంగళం ఉత్తరం, దక్షణపుకండ్రిగలోని చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. ఎగతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో నూలు మొత్తం తడిసిపోవడంతో పాటు గుంతల్లోకి నీరు చేరిందన్నారు. గుంతల్లోకి నీళ్లు రావడంతో పనులు జరగదన్నారు. తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

## హోర్డింగ్ రేకును తొలగించిన అధికారులు

వార్తా ప్రభావం...

రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త:



పొంచి ఉన్న ప్రమాదం ప్రమాదపు టంచుల్లో హోర్డింగ్ బోర్డు కేసు అనే శీర్షికతో డిసెంబరు 3 తేదీ వార్త దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బోర్డు రేకు వల్ల జరగబోయే ప్రమాదాన్ని కళ్ళకు కట్టినట్లు వార్తలో ప్రచురించడం జరిగింది. బోర్డు రేకు వల్ల ఏర్పడే ప్రమాదాన్ని అధికారులు గుర్తించి వెంటనే రేకుతో సహా హోర్డింగ్‌ను రైల్వే అండర్ బ్రిడ్జిపై నుంచి తొలగించారు. ప్రజలకు ఉపయోగపడే కథనాన్ని ప్రచురించిన వార్త దినపత్రికకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

## ఆహార పొట్లాల పంపిణీ

రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణంలోని ముంపు ప్రాంత ప్రజలను శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నేతలు రేణిగుంట పట్టణంలోని గాంధీనగర్, ధోబి కాలనీలో మంగళ వారం భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రతాప్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, నవాబు, వినయ్

# డప్పుల మోతతో దద్దరిల్లి శ్రీకాళహస్తి

## -శ్రీకాళహస్తిలో ఏడు గంగల జాతర సంబరాలు ప్రారంభం


విశేషాలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో మంచుకాలం నిర్వహించే ఏడు గంగమ్మల జాతర ఈ సారి దేవస్థానం పాలకమండలి, ఏగుగంగమ్మల జారత కమిటి నిర్వాహకుల సమన్వయంతో అంగరంగవైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం ఏడుగంగమ్మల కమిటి నిర్వాహకులు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పిలుపుతో సుమారు వందడ్రమ్ములను ఏర్పాటు చేసారు. ఒక్కసారిగా మంగళవారం మధ్యాహ్నం జాతర పిలుపు అన్నట్లు డ్రమ్ముల ప్రదర్శన జరిపారు.ఒక్కసారిగా వంద డప్పులు మోగుతుండగా కళాకారులు ఆడుతూ పాడుతూ సాగగా చూడటానికి వేయి కళ్ల చాలవన్నట్లు మారింది. ఊరేగింపును ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. యువ కమిటిల చొరవను శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అభినందించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జాతర నిర్వహణ చేపట్టారు. రెండు సంవత్సరాల పాటు కోవిడ్ నిబంధనలతో సంప్రదాయబద్దంగా ఏకాంతంగా నిర్వహించిన జాతర ఈ ఏడాది భక్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు.

**ఊరంతా సందడి: ముస్తాబులు**

గతంలో లేని విధంగా ఈ ఏడాది జాతర నిర్వహణలో శ్రీకాళహస్తీశ్వరాలయం కీలకంగా మారింది.నాలుగుమాడా వీధుల్లో విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా మారింది. ఇక ముత్యాలమ్మగుడిలో కూడా ఏర్పాట్లు చేసారు.కాగా కొత్తపేట గంగమ్మకు సుమారు ఒక ఫర్లాంగు దూరం విద్యుత్ దీపాల కాంతితో ముస్తాబు చేసారు. జయరామారావువీధిలోని గంగమ్మ వద్ద ముస్తాబులు చేసారు.కాగా ఊరంతా దేవస్థానం అరటి చెట్లతో ముస్తాబు చేసారు.అలాగే గంగమ్మకు ఇష్టమైన వేపాకు తోరణాలతో ముస్తాబు చేసారు.ఇక జాతర కమిటీల నిర్వహాకులు మంగళవారం మిచెంగ్ తుఫాను కరుణించటంతో ముస్తాబుల్లో తలమునకలయ్యారు. ఎవరికి వారు ప్రత్యేకతను చాటుకొనుటకు పోటీలు పడుతున్నారు.దాంతో జాతరకు ప్రత్యేకత సంతరించుకుంది.

# తుపానుతో రైతులకు తీరని నష్టం : నీట మునిగిన పంటలు


ఇళ్లలోకి వచ్చిన వరదనీరు

విజయపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త : మిచౌంగ్ తుపాను కారణంగా మండలంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో వరి, మిరప, వేరుసెనగ పంటలు నీట మునిగిపోయాయి. మండలంలోని ఎం.అగరంలో మిరప, ఉద్దుల పంటలు నాశనమయ్యాయి. కాళికాపురంలో వేరుసెనగ పంట జలమయమైంది. మాధవరంలో నూర్పిడికి సిద్దంగా వున్న వరి నీటిలో మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బెంగళూరు - చిత్తూరు హైవే రోడ్డులో కళియంబాకం - అత్తూరు మార్గమధ్యంలో ప్రణాళిక లేకుండా రోడ్డు పనులు జరుగుతుండడం వల్ల అత్తూరు రెవెన్యూలో సర్వే నెంబరు 113 వద్ద, శ్మశానం వద్ద వరద నీరు లోపలకు వెలుపలకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఒరూరు వద్ద తిరుత్తణి - నాగలాపురం రోడ్డుపై పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. తుపాను వల్ల ఆవాసం కోల్పోయిన వారిని, పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**జలదిగ్బంధంలో గ్రామాలు**

మండలంలోని ఆలపాకం, ముత్తప్పరెడ్డికండ్రిగ, ఒరూరు, మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడ గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆలపాకం గ్రామం చుట్టూ వరదనీరు చేరిపోవడంతో రెండు రోజల పాటు జన జీవనం స్తంభించిపోయింది. ముత్తప్పరెడ్డికండ్రిగ గ్రామంలో ఇళ్లలోకి నీరు చొరబడడం తో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల చుట్టూ ప్రతి ఏడాది వరదనీరు వస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.


నీట మునిగిన పంటలు

## ఉగ్రరూపం దాల్చిన కైవల్య నది, గోడేరు వాగులు



వెంకటగిరి, డిసెంబర్ 5 ప్రభాతవార్త తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వెంకటగిరి జలమయంగా మారింది. కైవల్య నది, గొడ్డేరు వాగులు వారి వర్షాలకు పొంగి ప్రవహించాయి. మన్నె గుంట కుడ్జాగుంట ప్రాంతాల్లో రోడ్డు వరద ప్రవాహానికి కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలు స్తంభించాయి. వెంకటగిరి పట్టణంలోని మాసాపేట, బొప్పాపురం బంగారుపేట ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరాయి. భారీ వర్షాలు వల్ల అపార నష్టానికి ప్రజలు గురయ్యారు. చిన్నన్నపేట చెరువుకు రంధ్రం పడి నీరు వృధాగా పోతున్నాయి. రైతులు, అధికారులు రంధ్రాన్ని పూడిపించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేయించారు.

## డీఎస్పీచే ఐరాల పోలీసు స్టేషన్ తనిఖీ



ఐరాల, డిసెంబర్ 5 ప్రభాతవార్త: చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి మంగళవారం ఐరాల పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న కేసుల వివరాలను, స్టేషన్ పరిధిలో నేరాలకు సంభందించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా వుండడంతో డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూ నేరాల నివారణకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఐరాల ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది వున్నారు.

## వర్షాలకు జలమయమైన పంటపొలాలు

### లబోదిబోమంటున్న ఎన్ఆర్ కమ్మపల్లి రైతులు



రామచంద్రాపురం, డిశంబర్ 5 ప్రభాతవార్త: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు జలమయమయ్యాయి. ఎన్ఆర్ కమ్మపల్లి - కాలేపల్లి ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెనకు అడ్డుగా రైతు జానకిరామిరెడ్డి మట్టిని పోయడంతో వర్షపు నీరు వెళ్ళడానికి దారిలేక పంటపొలాల్లోనే నిలిచిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెరకు, నారు మడులు పూర్తిగా నీటమునిగినట్లు వాపోయారు. మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెనకు అడ్డుగా వున్న మట్టిని తొలగించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వంతెనకు అడ్డుగా వున్న మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

## స్తంభించిన పౌర జీవనం

వడమాలపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పౌర జీవనం స్తంభించింది. ఆదివారం నుంచి ఎడ తెరపి లేకుండా వర్షం పడుతుండడంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 21 చెరువులు ఉండగా అన్ని చెరువులు 80 శాతం నిండిపోయాయి. సోమవారం మధ్యాహ్నంకు మండలంలో 126 మి.మీ వర్షపాతం నమోదైంది. వేమాపురం రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీ బొమ్మరాజపురం దళితవాడలోకి గూళూరు చెరువు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక సర్పంచ్ జేసీబీతో కాలువలు తీసి గ్రామంలోని వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో భానుమూర్తి, ఇతర అధికారులు కార్యాలయాల్లో ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.


బొమ్మరాజపురం దళితవాడలో ఇళ్ళలోకి వర్షపునీరు

## పైకప్పు పెచ్చులూడిన పంచాయతీ కార్యాలయం



బంగారుపాళ్యం, డిసెంబర్ 5 ప్రభాతవార్త: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లేడుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు పెచ్చులు ఊడి బల్లలు, కంప్యూటర్లు, యుపిఎస్, బ్యాటరీలు ధ్వంసం అయ్యాయి. అలాగే పైకప్పు నుండి ఉరుస్తున్న వానకు కార్యాలయంలోని ఫైళ్ళు తడిసి ముద్ద అయ్యాయి. జిల్లేడుపల్లి సచివాలయం నూతన భవనానికి ప్రభుత్వం 40 లక్షల రూపాయలు మంజూరు చేయగా ఈ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. కొంత మేరకు పనులు పూర్తి చేస్తే నూతన భవనంలోకి సచివాలయం మార్చవచ్చును. అధికారులు స్పందించి సచివాలయ భవన పనులను త్వరితంగా చేపట్టి పూర్తి చేయాలని సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు వేడుకొంటున్నారు. ఈ సచివాలయం పరిధిలోకి జిల్లేడుపల్లి, మంగళపల్లి, తంబుగానిపల్లి గ్రామ పంచాయతీలు వస్తాయి. ప్రస్తుతం జిల్లేడుపల్లి పంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక సచివాలయ పనులను నిర్వహిస్తున్నారు. అయితే వర్షానికి పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## రూ.3 లక్షల విలువైన 6 కేజీల గంజాయి స్వాధీనం: ముగ్గురు అరెస్టు

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: చిత్తూరు వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి ఎస్ఐ మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో మంగళవారం 3 లక్షల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి వెల్లడించిన వివరాల మేరకు పివికెఎన్ డిగ్రీ కళాశాల సమీపంలోని జడ్పీ క్వాటర్స్ పరిసరాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తనతో పాటు ఎస్ఐ మల్లికార్జున్ సిబ్బంది అక్కడికి వెళ్ళి పరిశీలించగా జడ్పీ క్వాటర్స్ సమీపంలోని పొదల్లో ఇద్దరు వ్యక్తులు నిల్చోని వున్నారని వారి వద్ద గంజాయి వుండటంతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించామన్నారు. అయితే పోలీసులను చూసిన వారు పరుగెత్తుకొంటూ వెళ్ళడంతో పోలీసులు వారిని వెంబడించగా అక్కడే మరో పొద వద్ద వున్న మరొక వ్యక్తి సైతం పోలీసులను చూసి పరిగెత్తడం చేశాడన్నారు. ఈ మేరకు పోలీసులు రిజ్వాన్, అన్సర్, రహ్మాతుల్లా అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తే రిజ్వాన్ అన్సర్ నుండి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని, అలాగే అన్సర్ రహ్మాతుల్లా అనే వ్యక్తి నుండి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తుండని, రహ్మాతుల్లాకు చిత్తూరుకు చెందిన ఓ మహిళ నుండి గంజాయి అందుతుందనే సమాచారం వుందని ఆ మహిళను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి వివరించారు. అలాగే పట్టుబడిన గంజాయిని రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించడం జరిగిందన్నారు.

## వృద్ధురాలి చైన్ దొంగ అరెస్ట్ : లా చదువుతున్న దొంగ



పుత్తూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త : పుత్తూరు రూరల్ మండల పరిధిలోని పరమేశ్వరమంగళం గ్రామంలో కొన్ని రోజుల క్రితం వృద్ధురాలిని తీవ్రంగా గాయపరిచి ఆమె మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల అయిదో తేదీన సాయంత్రం వేపగుంట క్రాస్ వద్ద పట్టుకుని అరెస్ట్ చేసినట్టు సిఐ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి.

పరమేశ్వరమంగళం వద్ద వున్న కెకెసి లా కాలేజీలో ఆర్.రంజిత్‌రావు (22) న్యాయ విద్య ఫైనల్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రం అరియలూరు జిల్లాలోని కట్టత్తూర్ సౌత్‌లో కలాని వీధికి చెందిన ఇతను పరమేశ్వరమంగళం గ్రామంలో నివశించే బాబు అనే వ్యక్తి ఇంట్లో స్నేహితుడు హరీష్‌తో కలిసి అద్దెకు వుంటున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన రంజిత్‌రావు తమ పక్కింటిలో నివశిస్తున్న ఇద్దరు వృద్ధ దంపతులను కొన్ని రోజులుగా గమనిస్తూ... బాధితురాలు నాగరత్నమ్మ మెడలో బంగారు తాళిబొట్టు, గొలుసు వుండడం చూశాడు. ఎవరూ లేని సమయంలో ఆమె వంటగదిలో వుండగా మెడలో వున్న గొలుసు తెంచడానికి ప్రయత్నించాడు. నాగరత్నమ్మ గట్టిగా కేకలు వేయడంతో ఎవరైనా వస్తారేమోనని భయంలో ఆమెను చంపైనా సరే గొలుసు లాక్కొని వెళ్లాలనుకున్నాడు. దాంతో ఆమెను గొంతుపైన, ముఖంపైన బలంగా కొట్టి ఆమెతో చీరతోనే ఆమె గొంతును గట్టిగా బిగించాడు. ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో గొలుసు లాక్కుని పారిపోయాడు. గొలుసుతో వాళ్ల ఊరికి వెళ్లేందుకు బస్సు కోసం వేచివుండగా వేపగుంట క్రాస్ వద్ద పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు.

## క్రీడలను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర

- ఎమ్మెల్సీ భరత్..ఎమ్మెల్యే వెంకటేగౌడ

- క్రికెట్ పోటీల్లో ఎమ్మెల్యే జట్టుపై ఎమ్మెల్సీ జట్టు విజయం



కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హాకింగ్స్ స్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈపోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. 15 ఏళ్ల పూర్తయిన ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొనగా ఎమ్మెల్సీ భరత్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి చైర్మెన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, మున్సిపల్ రెండో వైస్‌చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు, కుప్పం, పలమనేరు నేతలు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా బ్రోచర్, మస్కట్, ట్రోఫీలను ఆవిష్కరించిన టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన



తిరుపతి (క్రీడా), డిసెంబర్ 5 ప్రభాతవార్త : ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర వ్యాప్త క్రీడా కార్యక్రమాన్ని ఉద్దేశించి టిటిడి చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి బ్రోచర్, మస్కట్, ట్రోఫీలను ఆవిష్కరించారు. స్థానిక పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షేక్ సయ్యద్ సాహెబ్, కోచ్‌లు గోపి, వినోద్, హిందుజా, యహజాజ్ పాల్గొన్నారు.

## ఇంటిపై కూలిన పై కప్పు



పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త: పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం దళితవాడలో నివాసం ఉంటున్న బలరాం ఇంటిపై పై కప్పు కూలడంతో బలరాంకి గాయాలు అయ్యాయి. సదరు ఘటన స్థలాన్ని రామకృష్ణాపురం వైసీపీనాయకులు దేవేందర్‌రెడ్డి పరిశీలించి గాయాలకు గురైన బలరాంని తక్షణమే ఆస్పత్రికి పంపించారు. వారికి ప్రభుత్వం వద్దనుంచి తగిన సాయం అందించాలని అధికారులను కోరారు.

## తుఫానుతో ప్రజలు అతలాకుతలం



పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ప్రజలు అతలాకుతలమయ్యారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బ తిన్నాయి. గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాల వద్ద వంతెన కూలిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి చెందిన జగన్ తన ద్విచక్ర వాహనంపై వేణుగోపాలపురంకు వెళ్తుండగా గూళూరు చెరువులో నీరు ఉధృతికి మిట్టపాళెం వద్ద కాజ్‌వే వెళుతున్న నీటి ప్రవాహం లోకి వెళ్లాడు. ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. అతను మాత్రం చాకచక్యంగా బయటకు వచ్చాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు జేసీబీ ద్వారా ద్విచక్రవాహనాన్ని వెలికి తీశారు. నేసనూరులో ఏరు తెగి కల్వర్టు చిత్రమైంది. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీలో నీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ సహాయక చెరువుల్లో భాగంగా జేసీబీలు పెట్టి శుభ్రం చేయించారు.

## చిన్నారి కుటుంబానికి ఎంఎల్ఏ భరోసా



ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 5 ప్రభాతవార్త : మిచౌంగ్ తుఫాను నేపధ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీలో భారీ వర్షాలకు గోడకూలి మృతిచెందిన బాలుడు కుటుంబాన్ని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. జగనన్న ప్రభుత్వం తరపున రూ.4లక్షలు చెక్కును అందించి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, నారాయణ, మునిరామయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన తుపాను సహాయక చర్యలు

**బాధిత ప్రాంతాల్లో మంత్రి సోదరుడి పర్యటన**

**బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ**



పుత్తూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త : గత మూడు రోజులుగా తుపాను కారణంగా కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందించాలని, బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆదేశించడంతో నగరి నియోజకవర్గంలోని బాధిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం మంగళవారం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, నగరి మునిసిపల్ ఛైర్మన్ నీలమేఘం, ఎంపిపి భార్గవి తుపాను బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. తాము అండగా వుంటామని బాధితులకు భరోసా కల్పించారు. మునిసిపల్ పరిధిలోని చింతలపట్టెడ ఎస్టీ కాలనీలో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించ ఆరు. రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 60 కుటుంబాలకు అయిదు కేజీల బియ్యం, నూనె, కందిపప్పు, కూరగాయలు పంపిణీ చేశారు. టి.ఆర్.కండ్రిగ ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతాల్లో పర్యటించి ఇళ్లపైకి ప్రవహించే నీటిని దారి మళ్లించే ఏర్పాట్లు చేశారు. మండలంలో జగదిగ్బంధంలో చిక్కుకున్న వేలావడి ఎస్టీ కాలనీలోకి మోకాల్లోతు నీళ్లలో నడుచుకుంటూ వెళ్లి వారికి సహాయం అందించారు. అక్కడ 70 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఎం.కొత్తూరు ఎస్టీ కాలనీలో 20 బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వర్షాలకు దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా వున్న బీరకుప్పం ఆర్ అండ్ బి లింక్ రోడ్డు స్థానంలో యుద్ధప్రాతిపదిన కొత్తగా మట్టి రోడ్డు వేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు దయానిధి, అమర్, వైస్ ఎంపిపి కన్నియప్ప, ఆర్బికె ఛైర్మన్ బుజ్జిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, వేలాయుధం, రవి, నరసింహులు, చంద్రకళ, దామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖకు రూ.కోటి నష్టం

**-ఎపిఎస్పీడిసిఎల్ డైరెక్టర్ సుబ్బరాజు**



తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: మిచెంగ్ తుఫాను ప్రభావం వల్ల విద్యుత్‌శాఖకు తీవ్రనష్టం వాటిల్లిందని ఎపిఎస్పీడిసిఎల్ డైరెక్టర్ ఎన్.వి.సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో పర్యటించి నేలకూలిన విద్యుత్‌స్తంభాలు, పంటపొలాల్లో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, నీటితో నిండిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు అందించారు. మిచెంగ్ తుఫాను వల్ల తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో అత్యధికంగా నష్టం జరిగినట్లు తెలిపారు. తుఫాను కారణంగా 250 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 70 ట్రాన్స్‌ఫార్మర్లు పనికిరాకుండా పోయినట్లు తెలిపారు. దీంతో రూ.కోటి నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్‌వైర్లపై ఈదురుగాలుల వల్ల చెట్లు పడడంతో సరఫరాకు అంతరాయం కలిగిందని అంతేకాకుండా లైన్లను మరమ్మత్తులు చేయడంలో అధికారులు, సిబ్బంది తీరు ప్రశంసనీయం అన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా లేకపోతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కాగా కాగితాల హరిజనవాడలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. వర్షం కారణంగా అన్నదాతలకు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంటాయని ఎవ్వరు అధైర్యపడవద్దని తెలిపారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కరించాలన్నారు. ఆయనతోపాటు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి, డిఈఈ సతీష్‌బాబు, ఎఈఈ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటియుసి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

## ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద కరపత్రాలను విడుదల చేసిన నాయకులు



తిరుపతి టౌన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ఏఐటియుసి జిల్లా మహాసభలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు శ్రీకాళహస్తిలో జరుగుతన్నాయి. 17వ తేది భారీ బహిరంగ సభ జరుగుతుంది. ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మిక వర్గాన్ని కాళహస్తికి కదిలి రావాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద కరపత్రాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18,19 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రతినిధుల సభ జరుగుతుందని, ఈ ప్రతినిధుల సభలు మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన చర్చించి రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు ఈ మహాసభ రూపకల్పన చేస్తుందని అందుకు తిరుపతి ఆసుపత్రిలో పనిచేస్తున్న మెడికల్‌కాంట్రాక్ట్ కార్మికులు పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్స్, సెకూరిటీ గార్డులు పెద్ద ఎత్తున కదిలి కాళహస్తికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు నరసింహులు, మహేంద్ర, నాయకులు మునికేశవులు, మనోహర్ శేఖర్, ప్రసాద్, ఇంద్రాణి, సరస్వతి, పుష్ప, ధనలక్ష్మి, లింగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.


వార్త
ప్రభాతవార్తకు విలేకరులు కావలెను
తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
తిరుపతి ప్రెస్‌క్లబ్, తిరుపతి ఎడ్యుకేషన్, తిరుపతి జిల్లా కలెక్టరేట్, తిరుచానూరు, చిత్తూరు టౌన్, చిత్తూరు జిల్లా కలెక్టరేట్, పలమనేరు, పుంగనూరు, పాలసముద్రం, నాయుడుపేట, ఓజిలి కేంద్రాల్లో పనిచేయుటకు.
మీ పూర్తి బయోడేటాతో...
వారం రోజుల లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880